కిరీటి

[కథ]

= శ్రీ కడారు పోలుగురవాచార్య =

ఈ ప్రపంచంలో ఎన్నిరకాల ముఖాకృతులైతే మనుష్యుల్లో కనబడుతూ ఉంటవో, ఇంచుమించు అన్నిరకాల స్వభావాలూ కూడా మనుష్యుల్లో కనబడుతూనే ఉంటాయి. వారిలో ఒకరకం మనుష్యులున్నారు—వారు తమ జీవితకలశాల్ని మహత్వపూర్ణమైన లక్ష్యాలతోనూ, మతానుసరణీయమైన విజ్ఞాన సంపత్తితోనూ నింపుకుంటూ ఉంటారు. వారి జీవిత యాత్రలో ప్రేమబంధంగనక తగిలితే అది గాఢమై, అభేద్యమై అల్లుకుపోతుంది. దానితో—వారి అదృష్టం గనకతిన్నగాఉంటే స్వర్గసౌఖ్యాలనే అనుభవించగలరు; లేదా జీవితశేషమంతా గాఢాంధకారం చేసుకుని ఉద్వేగాదిదశావస్థలతో క్రుంగికృశించి పోవాల్సిందే! అంతేగాని ఏదోవిధంగా ఇంత గడ్డిమేసి—కడుపునింపుకుని—మనశ్శాంతికూడా పొందలేని అకర్మణ్యులు వీరు! పైగా అహోరాత్రాలూ ఏకాగ్రచిత్తులై, ఆలోచనోన్ముఖులై ఉండే వీరు అన్యమనస్కు లెలా అవగలరు?

తుమ్మిపూలు వికసించి సొంపులొలికించుకుంటూన్న కాలంలో శివపూజ కుపయుక్తమైనవే కాదు, అత్యంతప్రీతికరమైనవి కూడా! అయితే—శివాలయానికి తీసుకుపోబడినప్పుడే అవి దేవతాశిరస్సుపైన విరాజిల్లగలవు! ఇక కాకపోతే వడిలిపోయి, ఎండకు ఎండి, మంచుకు తడిసి, రాలి, దుమ్ముకొట్టుకుపోవాల్సిందేగాని వాటికిక వేరే గత్యంతరం ఏం ఉందీ?

కిరీటి మానసికప్రకృతీ, స్థితిగతులూకూడా కొంతరకు ఈతరగతికి చెందినవే!

కిరీటి తండ్రి ఉద్దండయ్యగారంటే — ఆ ఊరుకు పెద్దరైతుకాకపోయినా — పెద్దలెఖ్ఖల్లో మనిషే! సుక్షేత్రమైన పదిహేను, పదహారెకరాల మాగాణీ, ఉంటూన్న ఆ మండువాలోగిలీ వారికి ఉన్నై. ఇంకా కొద్దో గొప్పో నగదుకూడా ఉంది. ఆస్తిపాస్తులకేంగాని, మంచి పలుకుబడిగల మనిషి! ఆయనకు సంతానం ఈ ఒక్కకొడుకూ, ఒక్క కూతురూను. "ఒక్కగా నొక్క కొడుకూ, కూతురే అయినా, వా...ళ్ల...మ్మా బిడ్డలంటే! నిజంగా బంగారుబొమ్మలే! ఏం బుద్ధి అనుకున్నావూ? చూడా, వినా ముచ్చటౌతుంది. ఎందుకూ గంపె—?" అని ఇరుగుపొరుగుఅమ్మలక్కలు ఏకగ్రీవంగా మెచ్చుకుంటూఉంటారు.

కిరీటి స్కూలుఫైనలువరకూ స్వగ్రామంలోనే చదువుకున్నాడు. వయస్సుకు చిన్నవాడైనా బోలెడంత అనుభవం ఉన్నవాడిలా సంచరిస్తూఉంటాడు. చాలా సత్ప్రవర్తనాపరుడు! బుద్ధికి తగిన రూపమూ ఉంది. ఏకోశాన్నీ భేషజం లేని మనిషి! ఆఊళ్లో పదిమందిలోనూ తలలో నాలుకవలె మెలగుతూ ఉండేవాడు. స్కూల్లో తోటిస్నేహితులు మొదలు బయట ఊరిపెత్తందారు వరకూ అందరూ కిరీటి అంటే ప్రాణం పెట్టేవారు. తాను కాలేజీలో చదువుతోన్న రోజుల్లోకూడా తోటిగైతులతోపాటు తిరుగుతూ తానూ ఒక గైతయిపోయేవాడు. తా నేపత్రిక చదివినా, ఏసంగతి విన్నా నలుగురు గైతుల చెవినీ వేస్తూ కొన్నికొన్ని సమయాల్లో వారిలో నూతనచైతన్యాన్ని కూడా తీసుకువస్తూఉండేవాడు. మతానుసరణీయమైన

విషయాల్లో ఎంతో ఆదరమూ, ఆసక్తతా చూపుతూ ఉండేవాడు. ఏకాగితపు ఖరామత్తులు కావాల్సివచ్చినా కిరీటే ఓపిన శక్తికొలదీ రైతాంగానికి అండగా నిలబడే వాడు! ఆగ్రామంలో ఇంతకన్నా విద్యాధికులు లేక పోలేదు—ఉన్నారు. కాని కిరీటిమాదిరిగా సహాయ సంపత్తి నిచ్చేవారు మాత్రం కారు.

ఉద్దండయ్యగారికి ఆఊళ్లో రక్తస్పర్శ మూల కంగా ఆప్తులైనవారు ఒక్క రాజబాపయ్యగారి కుటుంబమే!

రాజబాపయ్యగారంటే సయానా ఉద్దండయ్య పిన్నత్తకొడుకు. రైతాంగంలో పెద్ద వాహినీ గల మనిషి. చుట్టుప్రక్కల గ్రామాల్లో ఆయనకు మంచి పరపతి ఉంది. ఆయనకూ యాభై, అరవై ఎకరాల మాగాణీ, పదిపన్నెండెకరాల మామిడితోటా, ఇంకా దానికి తగ్గ నగదూ ఉన్నై.

ఈ రెండుకుటుంబాల ఇళ్లూకూడా ఒక్క ఆవ రణలోనే ఉన్నై. రెండూకూడా మండువాభవం తులే! ఆపెద్ద ఆవరణలో ఉన్న ఆ రెండు ఇళ్లూ, సింహద్వారాలూ చూస్తే...ఒక చిన్న దేవిడీమాదిరీగా ఉంటుంది. ఆ రెండు ఇళ్లూ, దొడ్డీ మొదటలో ఎవరో ఇద్దరన్నదమ్ములదనీ, వారీయాస్తిని అమ్ముకుని ఈ ఊరునుంచి వెళ్లిపోయేముందే, వారిదగ్గరనుంచి వీరిద్ద రూ చెరికో ఇల్లూ ఈఊరుకు వచ్చిన క్రొత్తలో కొను క్కున్నారనీ, దాదాపు ఇప్పటికి పాతికఇరవైసంవత్స రాలౌతుందనీ చెప్పుకుంటూఉంటారు. వీథివాకిళ్లు వేరైనా వీరింటికీ, వారింటికీ మధ్య సరిహద్దుగోడ అప్పుడూ లేదు; ఇప్పటికీ లేదు. పేచీ, పూచీలేమీ లేకుండా తోడునీడగా ఉంటూన్న ఈకుటుంబాలకు సరిహద్దుగోడ ఉండాలనే సంకల్పమైనా కలిగినట్టు కనబడదు.

అలాంటప్పుడు రాజబాపయ్యగారి కుటుంబం కిరీటి అంటే పంచప్రాణాలూ పెడతారంటే ఆశ్చర్య పడాల్సిందేముంది? పైగా — ఆరెండు కుటుంబాలూ ఒకరిళ్లల్లో ఒకరు కలసీమెలసితిరుగుతూ ఉండటంవల్ల ఉద్దండయ్య, రాజబాపయ్యగార్ల కున్న ఆంతరంగిక స్నేహాన్నిబట్టీ బాపయ్యగారే వీరి కుటుంబానికి— నాలుగుకాలాలూ చూసినవాడేమో!—పెద్దదిక్కుగా ఉండేవాడు. కష్టసుఖాల్లో ఒకరికొకరు ఆదుకుంటూ ఉండేవారు. కిరీటికూడా 'రాజుమామయ్యా!' అంటూనే ఆయనకళ్ల ముందు పెరిగి పెద్దవాడయ్యాడు. ఎంతో చనువుగాకూడా ఉండేవాడు. మామదగ్గర తనకున్న చదువునంతా, వాత్సల్యాన్నంతా ఉపయోగించుకుని— "పెండ్లీడు కొచ్చిన పిల్లకు ఇంకా చదువు లెందు"కని రాఘవమ్మ శతపోరుపెట్టినా—పట్టుపట్టి వనజను యీ ఏడు ఫోర్తుఫారంలో చేర్పించింది కిరీటే!

అసలు కిరీటి హైస్కూల్లో చదువుకుంటూన్న రోజుల్లో బాపయ్యగారింట్లో చదువుకున్నవాళ్లెవరూ లేకపోటానీ, పైగా ఇంట్లో ఇల్లు అవటంచేతా కిరీటే పిల్లలందరకూ చదువుచెప్పుతూ ఉండేవాడు. వనజ కాస్తపెద్దక్లాసుల్లోకి వచ్చేసరికి కిరీటినిత్యకృత్యాల్లో వనజకు పాఠాలుచెప్పటంకూడా ఒకటయిపోయింది.

మొదటినుంచీ వనజ అంటే కిరీటికి సాధారణ వాత్సల్యం, మమకారం ఉండేవి. కాని, అతనూ పెరిగి, ప్రపంచంలో కాస్త మంచీ-చెడ్డా గ్రహించుకుంటూ, నాల్గువిషయాలూ ఆకరంచేసుకుంటోన్న రోజుల్లో తనకు వనజయందు అవ్యాజమైన ప్రేమ ఏదో ఉందని చూచాయగా గుర్తించాడు. ఆనాటి స్నేహలత పెరిగి, పెద్దదయి, పుష్పించి, శోభాయమానంగా ఉంటూన్న కాలంనాటికి ప్రేమబంధమై పెనవేసుకుంది. ఆప్రేమ తనలో ఎప్పుడు, ఏరూపంలో, ఎలా వచ్చికూర్చున్నదీ తెలియకపోయినా మొట్టమొదటిసారి గుంటూరుకు చదు వుకుపోయేటప్పుడుమాత్రం అతని మనస్సు చాలా బాధ పడ్డది. పెద్దపెద్ద భవనాల్లో...ఆకళాశాలల్లో చదువు తానని మొదటలో మురిసిపోయాడు. ఆ ఊహాడోలి కల్లో ఒక్కసారిగా ఊగివచ్చాడు. కాని 'వనజ ఇక కనబడదే!' అన్న ఆలోచనలు తట్టినతర్వాత ఊహా డోలికల్లోనుంచి క్రిందికి దొర్లించినట్లయింది. ఈవిచారం ఆవరించుకుని రాబోయే ఆనందం, ఆధిక్యతా దీనిముం దొక తృణప్రాయంగా కనిపించినై. తనకు వనజ అంటే ఎంత మక్కువ ఉన్నదీ అంతవరకూ తాను గుర్తించుకోలేని విషయం ఆనాడు స్ఫుటంగా కళ్లకు కట్టినట్టు కనబడింది.

వనజమట్టుకు వనజకుకూడా కిరీటి గుంటూరుపోయి యఫ్. ఏ. చదువుతాడంటే ఒకవిధంగా ఆనందం పట్ట లేకపోయింది. ఆరోజుల్లో బస్తీలకు పోయి, పెద్దపెద్ద కళాశాలల్లో చదువుచదువుతూన్నా డంటే గొప్పగా ఉంటూఉండేది. అది ఆఊరివారందరూ సగర్వంగా చెప్పుకుంటూఉండేవారు...అలాంటి ఆనందమే కిరీటి చదువుతాడంటే వనజకు కలిగింది. కాని ఆ ఆనం దాన్ని ఊహించుకొన్నకొద్దీ 'కిరీటి దూరమైపోతాడే' అన్న ఆందోళనతో అవ్యక్తమైన సంతాపకెరటాలు ఆ చిన్నహృదయసాగరంలో లేవటం సాగాయి.

కిరీటి వెళ్లలేకవెళ్లలేక గుంటూరు ప్రయాణమై వెళ్లిపోయాడు. దూరమైనకొద్దీ మనస్సులు మారిపోయి వాత్సల్యత తగ్గిపోతుంది. ఆప్రేమంతా కళ్లఎదుట కన బడుతూఉన్నంతకాలమేనని కొంద రభిప్రాయపడుతూ ఉంటారు. కిరీటిమాత్రం ఎన్నడూ యీమాటలతో ఏకీభవించేవాడు కాదు. ప్రేమేగనక ఉన్నట్లయితే దూరమైనకొద్దీ ద్విగుణీకృతమై పొంగుతూ ఉత్తేజ పూరితుల్ని చేస్తుంది. అస లాప్రేమ రాణించి, పైకి ఉబికి ఇదమిత్థమని తేల్చి నిరూపించేది ఆసమయం లోనే! నిజంగా దగ్గరున్నంతకాలమూ, నివురుగప్పిన నిప్పుల్లా ఉండే మనస్సులు కాస్తా దూరమవటంతో రాజుకుంటూ ప్రేమను గుర్తించి, తదేకచింతాక్రాం తులై ఉంటూఉంటారని వనజకు దూరమై ఉంటూన్న యీకొద్దికాలంలో కిరీటి గ్రహించాడు. ఎప్పుడు నాల్గురోజుల శెలవులు వరుసగా కలిసివస్తే, అప్పుడల్లా ఇంటి కొచ్చివాలేవాడు.

ఇక రెండుమూడు రోజులకు శెలవలయిపోయి, కిరీటి తిరిగి గుంటూరు వెళ్లిపోతా డనగా వనజకు అన్నంకూడా హితవుగా ఉండేది కాదు. దిగులుపడిన మనస్సుతో తిరుగుతూఉండేది. "ఇక లెఖ్ఖలెవరు చెప్తారు?" అన్న ఆలోచనలతో అన్యమనస్కంగా లెఖ్ఖలు చేస్తోండేది. చివరకు అన్ని లెఖ్ఖలూకూడా తప్పుతూనేఉండేవి.

ఇలానే కాలచక్రం మూడుసంవత్సరాల ముం దుకు దొర్లుకుపోయింది. ఇప్పుడు కిరీటి బి. ఏ. మొదటి సంవత్సరం చదువుతూ ఉన్నాడు.

వనజ తనది అవుతుందో కాదో అన్న సందే హం కిరీటికి అప్పుడప్పుడూ కలుగుతూఉండేది. పొరు గూరులో ఉండి చదువుకుంటూన్న ఈ మూడుసంవత్స రాల కాలంలో అత నీప్రశ్ననే అనేకసార్లు ప్రశ్నించు కునిఉంటాడు. కాని—అప్పటికప్పుడే మనస్సు తిర గేసుకుని, సమాధానపడుతూ మరచిపోతూఉండేవాడు.

ఒకరోజున సరిగ్గా ఇలాంటి సందేహంతోనే అతని మనస్సు కంపించిపోయింది. అవాళనే వేసంగి శెలవ లివ్వగానే ఇంటికొచ్చాడు. ఇంటికొచ్చీరావ టమే బాపయ్యగారింటికి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏం నాయనా కిరీటీ! ఎప్పుడొచ్చావు?"అని బాపయ్యగారిభార్య రాఘవమ్మ ఎంతో ఆదరంగా పల్కరించింది. ఆమెతో కాసేపు మాట్లాడినతర్వాత "వనజ ఎక్కడ అత్తయ్యా!" అన్నాడు.

"అదిగో! ఆప్రక్కగదిలోనే ఉండాలి"అని రాఘవమ్మ చెప్పగానే, కిరీటి ఆగదికేసి వెళ్లి పోయాడు.

వనజ ఆగదిలోనే ఉంది. పెట్టెమీద కూర్చుని పరధ్యానంగా రుమాలు అల్లుకుంటూఉంది. కిరీటికాలి చప్పుడు విని, తల పైకెత్తి చూస్తూనే చకితురాలైంది. అల్లుకుంటోన్నది కాస్త ఆపి, "వనజ ఇన్నాళ్లకు జ్ఞాప కానికి వచ్చిందా బావా?"అని సిగ్గుపడుతూ అంది. దానికి కిరీటి ఏం జవాబివ్వలేదుగాని—సమాధానమా అన్నట్టు చిన్ననవ్వు నవ్వేడు.

"ఎప్పుడూ రావటం?"అని తిరిగి వనజే అడి గింది.

"ప్రొద్దున్ననే వచ్చాను."

"ఏం ప్రొద్దున్న వచ్చేనా, ఇంతవరకూ కంటికే కనిపించారు కాదు."

కిరీటి చిన్ననవ్వు నవ్వి—"ఎందుకో! నాకోసం ఏమైనా దాచిఉంచావా ఏమిటి?"

"మరే! బస్తీనుంచేగా వచ్చింది!"అని మంత హాసం చేస్తూ అన్నది మధ్యనేఅడ్డి.

"తోటివాళ్లందరూ నాగార్జునకొండ చూడటానికని వెళ్లుతోంటే తప్పించుకు మరీవచ్చాను." అన్నాడు కిరీటి.

ఒక్క త్రుటికాలంలో వనజ గొంతుమార్చుకుని, "ఏం? అంత తప్పించుకురావటం ఎందుకు? వెళ్లే రాలేకపోయినారా? అసలు బస్తీలో ఉల్లాసంగా కాలక్షేపం చేస్తూఉండే మీరు ఈపల్లెకు రావటానికి మనస్సు ఎలా ఒప్పిందీ?"అంది.

"పైగా ఇదికూడానా వనజా! ఏదో చదువు చెప్పిన దోషం, మార్కులవీ ఎలా వస్తున్నవో, అసలేం చదువుతోన్నావో కనుక్కుందామని వచ్చాను..." అని కిరీటి అనేసరికి వనజ ప్రఫుల్లముఖియై అనేకసంగతులు చెప్పింది...ప్రస్తుతం చదువులో తనకున్న కష్టసుఖాల్నికూడా ఏకరువుపెట్టుకుంది.

కిరీటికి చూపించిన తన పరీక్షపేపర్ల నన్నింటినీ అలమరాలో పెట్టి తాళంవేస్తూ, వెనక్కి తిరిగి బావకేసి చూస్తూ—"థర్డుఫారం పాసై, రెండేళ్లు ఇంట్లో కూర్చుండిపోయినా, నువ్వు పట్టుపట్టి తిరిగి చేర్పించావు. కాని-ఇక చదువు చెప్పించనని అమ్మ ఖచ్చితంగా చెప్పుతూంది బావా!"అన్నది.

కిరీటి ఆమెముఖంలోకి చూస్తూనే, "ఔను నిజమే! నువ్వు పెద్దదానివయావు వనజా! ఈడు వచ్చింది. త్వరలో పెళ్లిచేయటమే మంచిది"అని నవ్వుతూ అన్నాడు. ఆశాభరితమైన అతని చూపులతో వనజశరీరంలో విద్యుచ్ఛక్తి ప్రవహించినట్లయి తలదానంతట అదే క్రిందికి వాలిపోయింది! ఆక్షణంలో నల్లకలువల్లాంటి ఆమెనేత్రాలు సిగ్గుతో మెరసిపోయినై. కిరీటిని చూసి ఆమె ఇప్పుడిప్పుడు కాస్త సిగ్గుపడుతోంది. లజ్జారసభరితమై కిరీటికేసి చూసినప్పటి వనజముఖం ఎంత అందగా ఉందీ!

ఆ మనోహర సౌందర్యాన్ని చూస్తూ కిరీటి కాసేపు నిలబడిపోయాడు. గులాబిరేకుల్లాంటి చెక్కిళ్లూ, ప్రకాశవంతమైన కళ్లూ, ఆ అంగసౌష్ఠవమూ చూస్తోంటే అతనికి కొంత ఆశ్చర్యంకూడా కలుగుతోంది..."వనజ నవయౌవనంలో ఉంది! నిజంగా ఎంత ధీరత్వంగా చూస్తోంది?"అన్న ఆలోచనలతో— "వనజా! నామీద నీ కింత అధికారాన్ని ఎవరిచ్చారంటావూ?"అన్నాడు.

"ఒకరిస్తే తెచ్చుకుండేదా బావా?" అని వనజ సవిలాసంగా అంటూ ఉంటే ఆమె పలుకులు వింటూనే కిరీటి నిలబడిపోయాడు. చిరునవ్వుల్ని వెదజల్లుకుంటూన్న ఆమె ఎఱ్ఱని పెదవులూ, ఆ మధురవీక్షణములలో ఉన్న మాధ్యమూ అతన్ని పులకితుణ్ణి చేసినై. తనకు చిరపరిచితమైన ఆమెసౌందర్యంలో ఏదో నూతనశోభ అతనికి రూపిస్తూనే ఉంది. కిరీటి చూస్తూచూస్తూ, "వనజా! నువ్వు అత్తారింటికి పోయేనాడు ఈ అధికారాన్ని ఎవరికి వప్పజెప్పిపోతావు?" అని అన్యమనస్కుని మాదిరిగా అనేశాడు. బయటపడిన ఈ మాటలను వింటూనే వనజ చకితురాలైంది. గుడ్లప్పగించి చూస్తూ కాసేపు నిలబడిపోయింది. మనస్సుకూడా చివుక్కుమంది. ఇంతలో తల్లి పిలవటాన్ని చివ్వున లోనికి పరుగెత్తిపోయింది.

ఆ ఏడు సంక్రాంతి శెలవలు ఎక్కువలేకపోవటాన్నీ, పైగా స్నేహబృందంతో దేశాటనకు వెళ్లటాన్నీ కిరీటి ఇంటికిరాలేదు. దసరాశెలవలకు ఇంటికొచ్చి తిరిగి వెళ్లిపోయేముందు సంక్రాంతి శెలవలకు తప్పనిసరిగా ఇంటికొస్తానని వనజకు ప్రతిజ్ఞ చేశాడు. కాని ఆ ప్రతిజ్ఞప్రకారం రాలేకపోయాడు. తిరిగి వనజను చూడటం ఇదే!

తర్వాత కొంతసేపటికి బలరామయ్య-బాపయ్యగారి కొడుకు-కూడా పొలంనుంచి వచ్చాడు. ఇద్దరు బావమరదులూ కాసేపు మాట్లాడుకున్న తర్వాత, చదరంగం ఆడుకుందామని బలరాముడు పట్టుపట్టడాన్ని వారిద్దరూ చదరంగపు ఆటలో ఐక్యమైపోయారు.

ప్రతి ఆటా కిరీటే గెలుస్తూన్నాడు. బలరాముడెన్ని ఎత్తులు వేస్తోన్నా, ఎత్తుకు పైఎత్తు వేస్తూ, అతని రాజును తరిమితరిమి కొడుతూ 'షహ్' చెప్పుతూనే ఉన్నాడు కిరీటి. ఆట ఓడిపోతూన్నకొద్దీ ఆడాలనే పట్టుదలకూడా బలరామయ్యకు ఎక్కువౌతూనే ఉంది. దానితో—కొన్ని పావుల్ని గళ్లలో

ముందుకూ, వెనక్కూ, ఇరుపార్శ్వాలకూ పరుగులు తీయిస్తోన్నాడు...మధ్యమధ్య దూకిస్తోన్నాడు. ఒక్కక్కసారయితే ప్రక్కవాటుగా ముందుకు దూసుకు పోతోన్నాడు...చివర కెటూ కదలడానికి వీలులేక నిలువుగ్రుడ్లుపడి నిలబడిపోతోన్నాడు. ఇంతలోనే భోజనాలకు పిలుపువచ్చింది. వనజ ఈ వార్త తేగానే, ఇక ఆడినా ఇప్పుడు ప్రయోజనం లేదనుకున్నాడో ఏమో మరి! "ఇంకెందుకులే, ఆట ఎత్తివేశేయి కిరీటీ!" అంటూ బలరామయ్య లోనికి చరచరా వెళ్లిపోయాడు.

వనజ బల్లమీది పావులన్నీ బరణిలో వేస్తూనే— "మహా అలసిపోయారుగాని, లేవండి లేవండి భోంచేద్దురుగాని" అని కిరీటి నుద్దేశించి అంది.

"ఎందుకులే వనజా! ఇంటికి పోయి భోంచేసే దానికి!"

"ఏం, మా ఇంట్లో భోంచేయకూడదనుకున్నారా ఏం?"

"ఉదయాన్నే గా వచ్చింది? అప్పుడే విందులా వనజా! చెయ్యాలంటే, అబ్బో!, ఇంకా మూడునెల్లు ఉంటానాయె" అంటూ కిరీటి కుర్చీ వెనక్కి జరుపుకుంటూ లేచి నిలబడ్డాడు.

"పాపం! తినలేరని. మీకు ఇప్పుడేం విందులు చేయబోవటంలేదు!" అని నవ్వుతూ, ఒక్కసారిగా గొంతు మార్చుకుని, "లేవండి బావా! భోంచేద్దురుగాని" అన్నది పావులూ, బల్లా తీసి అలమరలో పెట్టుతూ.

"ఇదంతా నీ పురమాయింపు కాదుగదా!" అని కిరీటి అంటూన్నా, వినిపించనట్టు ఊరుకునే లోపలికి పోయింది. ఆమెవెనకాలనే కిరీటికూడా వెళ్లాడు.

"ఎందుకత్తయ్యా ఇదంతా, ఇంటికి పోతోన్నానుగా" అన్నాడు కిరీటి.

"ఏ ముందిలే నాయనా! ఏదో, సమయానికి ఉన్నావు గనుక. నీకు ఆ ఇల్లూకటే, ఈ ఇల్లూకటేనా కిరీటీ?" అని రాఘవమ్మ అంటూనే ఉంది. ఇంతలోనే "చాల్లే—ఇక స్నానానికి లేరా!" అని బలరామయ్య కిరీటికి అంగవస్త్రం అందిస్తోంటే, మంత్రముగ్ధునిమాదిరిగా అందుకుని స్నానానికి లేచాడు. వాళ్లకు కావాల్సినవన్నీ అందిస్తూ వనజ అక్కడనే ఉంది. కిరీటికిమాత్రం మనస్సులో అభిలాష లేదనుకున్నారా?

వనజరూపలావణ్యాల్ని కళ్లారా చూస్తూ, మనసారా మాట్లాడుతూ, ఉప్పొంగుతోన్న ఉత్సాహం కొద్దీ భోజనాలకు లేచాడు.

భోజనాలవీ అయాక విజయలక్ష్మి తమలపాకులు తెచ్చి ఇచ్చింది. ఈ విజయ వనజతర్వాత చాలా కాలానికి పుట్టింది. ఈ సంవత్సరమే పుస్తకం పట్టింది. తాంబూలం వేసుకుని ఇద్దరు బావమరదులూ సావిట్లో కూర్చుని లోకాభిరామాయణం చెప్పుకుంటూన్నారు.

ఆ రోజు వనజ కొక పర్వదినంలా ఉంది. బావ మళ్లీ ఆర్నెల్లకు కనబడ్డాడాయె. వంపులొంపులు తిరిగి, నీడలుపారుతోన్న తన నల్లనికురులను పట్టిపట్టి దువ్వుకున్న దావేళ. ఉన్నవాటిలోకల్లా కాస్త మంచిబట్టలను—తనకు అభిమానమైన దుస్తుల్ని-తీసి కట్టుకున్న దారోజున!

ఆమెలో క్రొత్తదనం ఉట్టిపడుతూంది ఆ నూతనచైతన్యంతో, ఉల్లాసపూరితమై తేలిపోతూన్న మనస్సుతో, వీణను ముందుకు తీసుకుంది. ఆ వ్రేళ్ల పోకడల్లో నూతనత్వం త్రొక్కిసలాడుతూ, నృత్యం గాని చేస్తూన్నాయా అనిపిస్తున్నై. వీణాతంత్రులను సారించి—

".....మానసం
దేహి ముఖకమలమధుపానమ్.
త్వ మసి మమ భూషణం త్వమసి మమ జీవనం
త్వ మసి మమ భవజలధిరత్నమ్
భవతు భవ తీహ మయి సతత మనురోధినీ
తత్ర మమ హృదయ మతియత్నమ్
ప్రియే! చారుశీలే! ప్రియే! చారుశీలే!....."

అన్న అష్టపదిని దేశవరాళీ రాగంలో శ్రవణ సమ్మోహనంగా పాడుతోంది వనజ. పంచమస్థాయిలో వీణాగాన ప్రవాహాన్ని తన కిన్నెరకంఠంలోంచి వెల్లువలు కట్టిస్తూంటే, నాగస్వరం వింటూన్న కోడెత్రాచు

లాగా, లయతప్పని తలపంకింపుతో వింటూ, కనికట్టు కట్టడాన్ని తలవాల్చి బరిమీద పడుకున్న త్రాచులాగ పడకకుర్చీలో చారబడి వింటూన్నాడు కిరీటి. ఆ అష్ట పదంటే కిరీటి కెంతో మక్కువ! అప్రమత్తతతోనే వింటూన్న కిరీటి తనలోనూ పాడుకున్నా డీపాట. శ్రవణానందభరితుడై, తన్ను తానే మరచిపోయి కూని రాగాలు తీసుకుంటూ, వ్రేళ్లు వీణమెట్లమీద నడుస్తూ న్నట్లే అనుకరింపజేస్తున్నాడు. ప్రేమోన్మత్తత ఉన్న చోటనే ఇలా పరిణమించి విశేషాధిక్యత చెందుతూ ఉంటుందో, లేక వాస్తవంగా వనజకంఠమే మాధుర్య మేమో అని ఎవరికైనా సందేహం కలిగినాకలగవచ్చు కాని, ఏది ఎలా ఉన్నా వనజగొంతుమాత్రం మాధు ర్యంలో మాధుర్యాన్ని ఒలికిస్తూందని ఒప్పుకు తీరాల్సిందే!

ఇదంతా చూస్తోన్న రామూ "ఏం బావా! వీణ గాని తెప్పించమన్నావా ఏమిటీ?...మహా జోరుగా వాయిస్తోన్నావే కుర్చీమీదనే!" అన్నాడు పకపకా నవ్వుతూ. రామూ నవ్వేటంతవరకూ కిరీటి యీ లోకంలో పడనేలేదు...

"ఏం రామూ, చదరంగంగానీ ఆడదామంటూ న్నావా?" అని చివ్వున లేచి ముందుకు కూర్చుంటూ పరధ్యానంగానే అన్నాడు.

"నేనూ అదే అనుకుంటూన్నా-ఎప్పుడు బదిలీ తీర్చుదామా అని" అని రామూ అంటూ, లేచి, బరిణ తీసి పావులన్నీ పేర్చాడు. వనజకంఠంలోంచి వస్తూన్న కమ్మనిపాటల్ని ఒక చెవిని వింటూనే, పావుల్ని నప్పు తూన్నాడు కిరీటి.

వనజకంఠంలోనుంచి వెల్లువలుగట్టుకుని వస్తోన్న పాటలన్నీ కిరీటి చెవుల్లో గింగురుమంటూనే ఉన్నా యి. ఏ ప్రక్కనుంచి ఏపావు వచ్చిపడుతోందీ గమనిం చకనే పావుల్ని నప్పుతోన్నాడు. ఎత్తుకు పైఎత్తు వేస్తూండే కిరీటి సునాయాసంగా కట్టుబడి పోతో న్నాడు.

"చాల్లే! ఇక కట్టిపెట్టి వాళ్లకు కాస్త కాఫీ కాచివ్వు" అని రాఘవమ్మ కూతుర్ని కోప్పడుతూ ఉండటం కిరీటిచెవిని పడింది.

"పాడుకాఫీ! ఇప్పు డది లేకపోతేనేం? కమ్మని గానామృతంకంటేనా?" అని మనస్సులో విసుక్కు న్నాడు. ఆ వీణాతంత్రులను మీటుతోంటే శబ్దతరం గాలు ప్రోవై శ్రావ్యంగా వినవస్తోన్న ఆ ఝుణుఝుణా తరంగాలు కాస్తా కట్టుబడిపోయినై. పొంగిపొర్లు కొస్తోన్న ఆనందాన్ని చల్లార్చుకుంటూ గృహకృత్యా ల్లో కలిసిపోయింది వనజ. దానితో కిరీటిమనస్సు విస విసలాడిపోయింది.

"ఇదిగో! నీ మంత్రి ఎగిరిపోయాడోయ్" అని నవ్వుతూ రామూ పావును తీసి బయటపెట్టాడు.

"లక్ష్మిచేత పంపించరాదూ? నువ్వే వెళ్లాలా? ...ఒక్కొకపేడు మీదపడుతోన్న కొద్దీ బొత్తిగా పిల్లవై పోతూన్నావేం?" అని రాఘవమ్మ కఠోరంగా కేకలు వేస్తూంటే బయట కిరీటిచెవిని పడ్డా యా కేకలు.

కొంతసేపటికి విజయలక్ష్మి కాఫీతెచ్చి అన్న కూ, కిరీటిబావకూ ఇచ్చింది. తిరిగీ విజయే కప్పులు లోనికి తీసుకుపోయింది...వనజమాత్రం ఓరగా వేసి వున్న సావిటితలుపువెనకాలగా నిలబడే ఇవన్నీ పంపుతూ ఉన్నట్టు కిరీటి గ్రహించకపోలేదు.

వనజ ఉన్నట్టుండి ఒక్కసారిగా ఇలా ఎందుకు మారిపోయిందో అని కిరీటి మనస్సు వ్యాకులపడింది.

[సశేషము]